ప్రజాశక్తి
ఆదివారం 15 సెప్టెంబర్ 2024 పేజీలు 8



విజయనగరం



పార్వతీపురం మన్యం

విజయనగర ఉత్సవాలు..

- సంప్రదాయ బద్ధంగా పైడిమాంబ సిరిమాను సంబరం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఉత్సవాలు, అమ్మవారి పండగ నిర్వహణపై సమీక్ష

మధుర స్మృతులను మిగిల్చేలా..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, కోట

జిల్లా ప్రజలకు మధుర స్మృతులను మిగిల్చేలా విజయనగరం ఉత్సవాలను, పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరాన్ని నిర్వహించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికార యంత్రాంగాన్ని కోరారు. ఈ ఉత్సవాలకు సుమారు ఐదారు లక్షల మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అక్టోబరు 13, 14 తేదీల్లో విజయనగరం ఉత్సవాలు, 14,15 తేదీల్లో పైడితల్లి అమ్మవారి పండుగ నిర్వహణపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ, విజయనగర ఉత్సవాలు, అమ్మవారి పండుగ నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ శాఖలన్నీ (మిగతా..3లో)

భూమిని సాధించుకునే వరకూ పోరాటం

- పెద్దల ఆక్రమణలో ఉన్న భూములను పేదలకు ఇవ్వాలి
- సదస్సులో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు



మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చావైనా రేవైనా పెత్తందార్లు ఆక్రమించిన పేదల భూములను సాధించుకునే వరకు పోరాడుతామని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ధడాల సుబ్బారావు అన్నారు. శనివారం స్థానిక ఎన్ పి అర్ శ్రామిక భవనంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అన్యాక్రాంతమైన భూములను పేదలకు ఇవ్వాలని కోరుతూ జిల్లా సదస్సు జరిగింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో ఐదు,ఆరు మండలాల్లో పేదలు భూములు వేల ఎకరాలు కొంతమంది పెత్తందార్ల చేతుల్లో ఉన్నాయన్నారు. ప్రధానంగా మెంటాడ మండలంలో ఉన్న పది గ్రామాల్లో పేదల వద్ద ఉన్న రెండు వేలు ఎకరాల భూమిని అప్పుల రూపంలో, సహాయం పేరుతో ఎత్తందార్లు చేతుల్లోకి తీసుకున్నారని (మిగతా..3లో)

లోక్ అదాలత్‌లో 5491 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 5491 కేసులను పరిష్కరించారు. కేసులను సామరస్య పూర్వకంగా, స్నేహపూరిత వాతావరణంలో, వివాదాలు లేకుండా పరిష్కరించే ఏకైక మార్గం లోక్ అదాలత్ అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్ కేసులు, రాజీ (మిగతా..3లో)



జిల్లా కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

బడిబస్సు డ్రైవర్‌పై దాడి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వేపాడ చెరువు కాటా వద్ద శుక్రవారం బడిబస్సు డ్రైవర్‌పై కొంతమంది దుండగులు దాడిచేశారు. రక్తం వచ్చేలా కొట్టారు. ఈ సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట శృంగవరపుకోట డిపో డ్రైవర్లు నిరసన తెలిపి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. శృంగవరపుకోట ఆర్‌టిసి డిపో నుంచి వేపాడ మీదుగా ఆనందపురం వరకు విద్యార్థుల కోసం బడిబస్సును నడుపుతున్నారు. శుక్రవారం బస్సులో విద్యార్థులను తీసుకెళుతుండగా, వేపాడ చెరువు కాటా వద్ద రోడ్డుపైకి కుక్క రావడంతో డ్రైవర్ గణేష్ బస్సును నెమ్మదిగా నడుపుతూ పక్కకు తీశాడు. ఆ సమయంలో అక్కడున్న దుండగులు డ్రైవర్‌ను బస్సును ఆపి, అందులోంచి డ్రైవర్‌ను కిందికి లాగేశారు. డ్రైవర్ చెవిపై జి.ఏసుదాసు అనే వ్యక్తి కొట్టడంతో చెవి నుంచి రక్తం వచ్చింది. అయినా ఆగకుండా మరికొంతమంది ఆయనపై దాడిచేసి, జేబులో ఉన్న నగదు తీసుకెళ్లిపోయారు. ఈ ఘటనపై శృంగవరపుకోట డిపో డ్రైవర్ల యూనియన్ నాయకులు శనివారం వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. డ్రైవర్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే బస్సులు నడిపే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. అనంతరం స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. డ్రైవర్ యూనియన్ సభ్యులు ఎస్.సతీష్, కె.జి.రాజు, ఎం.ఎస్.నాయుడు, జి.ఎస్.రాజు, పి.ఎస్.నాయుడు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న బస్ డ్రైవర్లు


పురిటిపెంట గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆర్‌పిఎఫ్ పోలీసుల అవగాహన

ప్రజాశక్తి-గజపతినగరం

రైలు ప్రమాదాల పట్ల ఆర్‌పిఎఫ్ పోలీసులు శనివారం పురిటిపెంట గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా పురిటిపెంట రైల్వేగేటు వద్ద రైళ్లు నిలిచేటప్పుడు వాటి కింద నుంచి ట్రాక్‌ను దాటవద్దని సూచించారు. ప్రయాణిస్తున్న రైళ్లపైకి రాళ్లు విసరవద్దని, అవి తిరిగి మనకే తగిలి ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. అంతేకాకుండా ఈ రూట్‌లో త్వరలో వందేభారత్‌రైలు వెళుతుందని, దూరంగా ఉండనే ఉద్దేశంతో ట్రాక్‌ను దాటే సాహసం చేయవద్ద కోరారు. దానిపైకి రాళ్లు విసరవద్దని సూచించారు. కార్యక్రమంలో బొబ్బిలి ఆర్‌పిఎఫ్ ఎస్ఐప్రదీప్‌కుమార్, ఎఎస్ఐ డివి మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఆటో

మంచిమనసు చాటుకున్న 'బుద్ధా'

ప్రజాశక్తి-వేపాడ

జాకేరు సర్పంచ్ బుద్దా చిన్నమ్ములు, బుద్దా అప్పలనాయుడు మంచి మనసు చాటుకున్నారు. జాకేరు నుంచి సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు సుమారు 20 మంది విద్యార్థులు కాలినడకన వస్తున్నారు. వీరంతా ఆటోలో వచ్చి వెళ్లే స్తోమత లేని పేద విద్యార్థులు. ఈ విషయాన్ని పాఠశాల గణిత ఉపాధ్యాయుల ఆతవ రవిశంకర్, సిఆర్‌పి కె.రామప్రసాద్... సర్పంచ్ బుద్దా చిన్నమ్ములు, గ్రామపెద్ద బుద్దా అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే వారు స్పందించి విద్యార్థుల కోసం ఆటోను ఏర్పాటు చేశారు. దీంతో అప్పలనాయుడు దంపతులకు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

17 నుంచి స్వచ్ఛత కార్యక్రమాలు

ప్రజాశక్తి-వేపాడ

ఈ నెల 17 నుంచి అక్టోబరు రెండో తేది వరకు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ బిఎస్‌కెవెన్ పట్నాయక్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టాల్సిన కార్యక్రమాలపై కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి.రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మల్లమ్మపేట శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కొప్పలవెలమ సంక్షేమ సంఘం నాయకులు పోల జగన్ ఒక ప్రకటనలో అధికారులను డిమాండ్ చేశారు. శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం, మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో గ్రామంలో ఎవరైనా మరణిస్తే అక్కడికి వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన వాటికకు రోడ్డు వేసి మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురంలో శిలువ గిరి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్‌కె పాడు విచారణ కర్తలు రెవ్ రెండ్ ఫాదర్ ఛార్ల్స్ ఆధ్వర్యంలో బెలగాం విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ థామస్, రెవరెండ్ ఫాదర్ డిసి రాజు లేవిడి విచారణ కర్తలు దివ్యబలి పూజ సమర్పించారు. శిలువ విలువ, చరిత్ర గూర్చి వివరించారు. కార్యక్రమంలో దేవానంద్, వైస్ ఎంపీపీ శేఖర్, శేషగిరి, గోపాల్, ఉపదేసులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-బాడంగి

బాడంగి గ్రామానికి చెందిన కండి లక్ష్మణ ఇటీవల విశాఖపట్నంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు శనివారం బాడంగిలో లక్ష్మణ కుటుంబాన్ని పరామర్శించారు. లక్ష్మణ మృతి పట్ల తన ప్రగాఢ సంతాపం ప్రకటించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటామని హామీఇచ్చారు. ఆయన వెంట జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, వైసిపి నాయకులు సంఘయ్య, శ్రీను ఉన్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శంబంగి

సీతంలో ఇంజినీర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

భారత రత్న మోక్షగుండం విశ్వేశ్వరయ జయంతిని పురస్కరించుకొని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఇంజినీరింగ్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విజయనగరం పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చీకటి దివాకర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనే సుస్థిర పరిష్కారాలు సృష్టించడంలో ఇంజినీర్ల పాత్రను, ప్రాముఖ్యతను, పర్యావరణ సమస్యలను పరిష్కరించడంలో ఆవిష్కరణాత్మక ఇంజినీరింగ్ విధానాల ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. రవి కిషోర్ మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్న ఇంజనీర్ల పాత్రను తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, సీతం డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు ఇంజినీర్స్ డే ప్రాముఖ్యతను, సమాజానికి సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ఆవిష్కరణలను ప్రదర్శించారు. విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రిటైర్డ్ డిఇ దివాకర్

సిటియులో హిందీ దివస్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీలో శనివారం హిందీ దివస్ నిర్వహించారు. ముఖ్య అతిథి గా విచ్చేసిన ప్రొఫెసర్ దిలీప్ సింగ్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందీ భాష రాజ్యభాష అని, అందరికీ దీనిలో ప్రావీణ్యం ఉండాలని, హిందీ భాష కు సంబంధించిన సాహిత్యంపై తన అభిప్రాయాలను అనుభ వాలను పంచుకున్నారు. భాష యొక్క భవిష్యత్తు అవకాశాలను పెంపొందించాలని చెప్పారు. విశిష్ట అతిథి గా విచ్చేసిన గీతా వర్మ మాట్లాడుతూ హిందీ భాషపై తన అవగాహన, అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.వి.కట్టిమని అధ్యక్షోపన్యాసం చేస్తూ హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ : మండల కేంద్రంలోని శ్రీవిద్యర్థి పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రాఘవ్ మాట్లాడుతూ హిందీపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఘనంగా సుజయకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మాజీ మంత్రి, టిడిపి రాష్ట్ర ఉపాధ్య క్షులు సుజయకృష్ణ రంగారావు జన్మదిన వేడుకలు శనివారం బొబ్బిలిలో ఘనంగా నిర్వహించారు. కోటలో టిడిపి అభిమానులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే బేబినాయన కేక్ కట్ చేశారు. అన్న క్యాంటీన్ వద్ద పేదలకు భోజనాలు పెట్టారు. రాజా కళాశాల వద్ద అధ్యాపక సిబ్బంది అన్నదానం చేశారు. నేను సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, వాసు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

జిల్లాలో మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌పి వకుల్‌జిందాల్ హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవ్వడం లేదా ఇతర వాహనాలను ఢీ కొట్టి ప్రమాదాలకు కారకులవు తున్నారన్నారు. ఇటువంటి వాహనదారులను కట్టడి చేసేందుకు ప్రతి రోజూ విజిబుల్ పోలీసింగులో ప్రత్యేకంగా డ్రైవ్ చేపడుతున్నామన్నారు. ఇటీవల మద్యం సేవించి విజయనగరం పరిధిలో ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో నిందితులు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తున్నారన్నారు. విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐలు శంబంగి రవి, లోవరాజు, ఎ.మహేశ్వరరాజు, చిన్నారావులు ఇటీవల ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 25 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, వారిని న్యాయస్థానం ముందు హాజరుపర్చగా, వారికి ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించారని తెలిపారు. ప్రమాదాలను నియంత్రించడంలో భాగంగా జాతీయ, రాష్ట్రీయ రహదారులపై లారీలను అర్థంతరంగా నిలపవద్దని, రహదారులపై నిర్దేశించిన పార్కింగు ప్రదేశాల్లో మాత్రమే లారీలను నిలపాలని డ్రైవర్లకు సూచించారు.

తెలుగు మాధ్యమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో ఎపిటిఎఫ్ జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం లేకపోవడంతో విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంగ్లీషు మీడియంతోపాటు తెలుగు మీడియం కూడా అమలు చేసి ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రకరకాల యాప్స్ అమలు చేయడంతో ప్రధానోపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించకుండా పని సర్దుబాటు పేరుతో తాత్కాలికంగా నియమించడం సమంజసం కాదన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు జోగినాయుడు మాట్లాడుతూ ఏకీకృత సేవా నిబంధనల అమలుపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు జి.లక్ష్మణరావు, కె.శ్రీను, జివిఎన్ మూర్తి, పరిసినాయుడు, కె.సింహాచలం, బండి రమేష్, ఎస్.ఎల్లయ్య, బి.దర్శనం, రమేష్ పాల్గొన్నారు.

వల్లంపూడి ఎస్ఐగా దేవి

ప్రజాశక్తి-వేపాడ


ఎస్ఐ దేవి

వల్లంపూడి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బి.దేవి.. శనివారం బాధ్యతలు స్వీకరించారు. మెంటాడ మండలం ఆంధ్ర పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. గతంలో తాను ఇక్కడ విధులు నిర్వర్తించానని, ఆ అనుభవంతోనే మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ దేవి తెలిపారు.

తొలిదశలో గుర్తిస్తే కేన్సర్ ప్రాణాంతకం కాదు

ప్రజాశక్తి-రామభద్రపురం

తొలిదశలోనే గుర్తిస్తే కేన్సర్ ప్రాణాంతకం కాకుండా చికిత్సతోనే నివారించవచ్చని విశాఖపట్నం మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి వైద్య నిపుణులు సుభద్ర అన్నారు. శనివారం ఆరికతోట పిహెచ్‌సిలో ఐఆర్‌డిఎస్ సంస్థ అధ్యక్షులు చిక్కాల స్వాతిశ్రీ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరం, విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి వారు కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సర్పంచ్ పెంకి పుష్పమ్మ, నవజీవన్ ట్రస్ట్ ప్రతినిధులు సహకారం అందించారు. ఈ సందర్భంగా 150 మందికి డాక్టర్ సుభద్ర పరీక్షలు చేశారు. పుష్పగిరి కంటి ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ సురేష్, ఆప్తాలమిస్ట్ కోమల ఆధ్వర్యంలో సుమారు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 32మందిని శస్త్రచికిత్సలకు తరలించారు. శిబిరాలకు పిహెచ్‌సి ఇఒ మల్లికేశ్వరరావు, వైద్య సిబ్బంది సహకారం అందించారు.

ఇకెవైసి పరిశీలన

శృంగవరపుకోట: మండలంలోని సంతగొరమ్మపేట, వినాయకపల్లి గ్రామాల్లో రైతుల ఇకెవైసిని శనివారం మండల వ్యవసాయ అధికారి కె.రవీంద్ర పరిశీలించారు. ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ రవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంతకీ ఎంత?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఇంతకీ వర్షాల కారణంగా జరిగిన నష్టమెంత? ప్రభుత్వానికి ప్రతిపాదించిందెంత? ప్రభుత్వం నుంచి ముందస్తుగా వచ్చిందెంత? అందులో ఖర్చుచేసిందెంత? ఇంకా మిగిలి ఉన్నదెంత? ఇది జిల్లాలో వరద నష్టాలు, ముందుస్తు చర్యలపై ఈవారంలో జోరుగా సాగిన పబ్లిక్ టాక్. జిల్లాలో రెండు మూడు రోజులపాటు భారీ వర్షాలు కురిసిన సంగతి తెలిసిందే. దీంతో, నదుల్లో ఉధృతి పెరిగింది. జలాశయాలు నిండుకుండలా తొణికిసలాడాయి. తాటిపూడి, మడ్డువలస జలాశయాల గేట్లను ఎత్తివేశారు. మిగిలిన జలాశయాల్లోనూ ఔట్ ఫ్లో కన్నా ఇన్‌ఫ్లో ఎక్కువగా రావడం, పలు చోట్ల చెరువు గట్టులు, కల్వర్టులు, కాజ్‌వేలు కొట్టుకుపోవడం విధితమే. ఈ క్రమంలో తోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. ఇందుకు తగ్గట్టే అధికారులు జనాల్ని అప్రమత్తం చేస్తూ హడావుడి



చేశారు. వాన తెరుపు ఇచ్చి నాలుగైదు రోజులు కావస్తున్నా ఇప్పటికీ శాఖల వారీగా నష్టం ఎంత? అన్నది ఇప్పటికీ తేల్చలేదు. కాదు... కాదు... బయటకు పొక్కనివ్వలేదు. దీంతో, జనం పలు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. నష్టం ఎంత అనేది చెప్పడానికి అధికారులకు వచ్చిన ఇబ్బంది ఏమిటి? అనేది కొంతమంది అంటుంటే అసలు నష్టం ఎంత అనేది ఖచ్చితమైన లెక్కలతో ప్రభుత్వానికి నివేదిస్తే కాదా? ప్రజాప్రతినిధులు రాజకీయంగా ఒత్తిడి చేయడానికి, ఉదారంగా స్పందించడానికి వీలుంటుందని కూడా మరికొందరు వాదిస్తున్నారు. అధికార యంత్రాంగం వైఖరి మరోలా కనిపిస్తోంది. 'వరదలు వచ్చినప్పు ప్రభుత్వంపై నుంచి ఒత్తిడి లేకుండా చూసుకునేందుకు కష్టనష్టాలను ప్రకటించలేదు. వరద ప్రమాదం తగ్గుముఖం పట్టాక నష్టం కంటే ఎక్కువే చూపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని జనం చర్చించుకుంటున్నారు. ఇందుకోసం కొన్ని పత్రికలకు అనధికారికంగా లీకులు ఇవ్వడమే ఇందుకు తార్కాణమని, దాన్ని ప్రభుత్వం ఖరారు చేసుకుని నిధులిస్తే నచ్చినట్టు వ్యవహరిస్తున్నారని కాస్త లోతుగా పరిశీలన చేసినవారినోట వినిపిస్తున్న మాట. అందుకే నష్టం వెల్లడించే విషయంలో గోప్యత పాటిస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారం కాస్త పక్కనబెడితే భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ముందు జాగ్రత్త చర్యలు, పునరావాస కల్పన కోసం ప్రభుత్వం రూ.2కోట్లు విడుదల చేసినట్టుగా సమాచారం. ఆ లెక్కలేవీ బయటకు పొక్కనివ్వడం లేదని ఇటు జనం అటు పలు శాఖలకు చెందిన అధికారులు కూడా వ్యాఖ్యానిస్తున్నారు. ఈనేపథ్యంలో అధికార యంత్రాంగం తమ పాదర్శకతను నిరూపించుకోవడంతోపాటు వరద నష్టంపై ప్రజలకు వాస్తవిక లెక్కలను చూపాల్సిన అవసరం ఉంది.


విజయనగర ఉత్సవాలు.. మధుర స్మృతులను మిగిల్చేలా..

(మొదటి పేజీ తరువాయి)

సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సుమారు రూ.2కోట్ల అంచనా వ్యయంతో పండుగను, ఉత్సవాన్ని నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు చెప్పారు. అన్ని రకలా సంప్రదాయాలను పాటిస్తూనే, అమ్మవారి పండుగ నిర్వహించాలని ఆదేశించారు.

ముందుగా కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ ఉత్సవాలు, పండుగ నిర్వహణకు, వివిధ శాఖల ద్వారా చేయనున్న ఏర్పాట్లను వివరించారు. శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. ఆలయం వద్ద ఏర్పాట్లను పైడిమాంబ దేవస్థానం చూడాలని, త్రాగునీరు, విద్యుత్ దీపాల అలంకరణ, పారిశుధ్యం పనులను మున్సిపాల్టీ నిర్వహించాలని ఆదేశించారు. సిరిమాను తరలించడం, రూపొందించే బాధ్యతలను అటవీశాఖకు, రవాణా ఏర్పాట్లను ఎపిఎస్ఆర్‌టిసి, ప్రాంతీయ ఉప రవాణాకమిషనర్‌కు అప్పగించారు. తెప్పోత్సవాన్ని సజావుగా నిర్వహించే బాధ్యతను మత్స్యశాఖకు అప్పగించినట్లు తెలిపారు. ఈ ఏడాది రెండు రోజులపాటు 11 వేదికల్లో విజయనగరం ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా హెలీకాప్టర్ రైడ్‌తోపాటు, మరికొన్ని ఇతర హంగులను ఏర్పాటు చేయడానికి యోచిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, అమ్మవారి ఉత్సవాలకు లక్షలాదిమంది భక్తులు హాజరవుతారని, అందుకు తగ్గట్టుగా పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని కోరారు. సిరిమానోత్సవం త్వరగా ప్రారంభమయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, పైడితల్లి అమ్మవారి గొప్పతనం, విజయనగరం ప్రతిష్టను చాటిచెప్పేవిధంగా డాక్యుమెంటరీని రూపొందించనున్నట్లు ప్రకటించారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన పైడితల్లి అమ్మవారి పండుగకు రాష్ట్ర ముఖ్యమంత్రిని కూడా ఆహ్వానించామని తెలిపారు. విజయనగరం ఎంఎల్ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. దసరాకుమైసూరులో నిర్వహించే ఉత్సవాలకు ఎంతో పేరు ఉందని, పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను కూడా ఆ స్థాయికి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. అమ్మవారి పండుగ, విజయనగరం ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ వివరించారు. సమావేశంలో నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, పైడితల్లి అమ్మవారి ఆలయ ఇఒ డివివి ప్రసాదరావు, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బొత్సకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కడుబండి, నాయకులు

బొత్సను కలిసిన కడుబండి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జామి మండల అధ్యక్షులు గొర్లె రవి కుమార్, అల్లు మహాలక్ష్మి నాయుడు (బుజ్జి), బొడ్డవర మాజీ సర్పంచ్ సాంబరాజు, దేవరపు సన్యాసిముడు, ముసిడిపల్లి సర్పంచ్ కనకం, మాజీ సర్పంచ్ వర్రి సత్యారావు, బాబూరావు పాల్గొన్నారు.

భూమిని సాధించుకునే వరకూ పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఈ భూములను లీజుకు తీసుకున్నామని చెప్పి పెద్దలు కొల్లగొట్టడం దుర్మార్గమన్నారు. గతంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2023జులైలో జీవో తీసుకొచ్చి భూములు వెనక్కి తీసుకొని పేదలకు ఇస్తామని చెప్పారని,కానీ అది ఆచరణకు నోచుకోలేదన్నారు. ఇటీవల చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రి బలగాని సత్యప్రసాద్ ను కలిసినా గ్యారంటీగా ఇప్పిస్తామని చెప్పడం లేదన్నారు.ఎది ఏమైనా సరే పేదలు భూములు పేదలకు దక్కే వరకు వ్యవసాయ కార్మిక సంఘం పోరాడుతుందని, ఈ పోరాటంలో పేదలు, దళితులు, గిరిజనులు, బిసిలు భూమి పోగొట్టుకున్న పేదలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. సదస్సులో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లి శ్రీనివాసరావు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాకోటి రాములు, శ్రామిక మహిళా సంఘం నాయకులు వి.లక్ష్మి తదితరులు మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. సదస్సుకు ముందు రెండురోజులక్రితం మరణించిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యకాస జిల్లా కమిటీ ఇదే..

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ 18 మందితో ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షులుగా జ.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగాజి.అప్పారావు, సహాయ కార్యదర్శులుగా లింగాల వెంకటరావు, టి.కృష్ణ, ఎల్.ఎర్రంనాయుడు, ఉపాధ్యక్షులుగా లెంక సింహాచలం, ఎస్.కృష్ణవేణి ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగాఎం.అప్పలనర్సయ్య, ఆర్.నాగేష్, జి.అప్పారావు, బి.సింహాచలం, బి.అప్పారావు, జి.శంకర్, టి.ఈశ్వరరావు, ఎల్.ఆదిలక్ష్మి, ఎల్.ఈశ్వరరావు ఎన్నికయ్యారు.

లోక్ అదాలత్‌లో 5491 కేసులు పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

పడదగిన కేసులను ఇరు పార్టీల సమ్మతితో శాశ్వతంగా పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి, సాలూరు, శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం, కొత్తవలస, కురుపాం కోర్టుల్లో 5491 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. 10,600 మంది కక్షిదారులు ప్రయోజనం పొందారని వివరించారు. విజయనగరంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు ఎస్.దామోదర్ రావు, ఎం.మీనాదేవి, ఎన్.పద్మావతి, కె.నాగమణి, కె.విజయకళ్యాణి, బిహెచ్‌వి లక్ష్మికుమారి, టి.వి.రాజేష్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : రాజీ మార్గమే శ్రేయస్కరమని అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జోస్ఫిన్ అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్‌లో నిర్వహించారు. అదాలత్‌లో 647 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు. వీటిలో సివిల్ ప్రొనోట్ కేసులు -6, చెక్ బౌన్స్ కేసులు-3, అమలు పిటిషన్ 01, బిఎస్ఎన్ఎల్ ప్రీ లిటిగేషన్ కేసులు 17, మెయింటినెన్స్ కేసు -1, క్రిమినల్ కేసులు-145, సమ్మరీ ట్రయిల్ కేసులు 474 లను ఇరుపక్షాల సమక్షంలో పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చంద్ర కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, ఎపిపి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజాం : స్థానిక కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ లో 183 కేసులు పరిష్కారమయ్యాయి. సీనియర్ సివిల్ జడ్జి సిహెచ్ వివేక ఆనంద్ శ్రీనివాస్ అధ్యక్షతన ఒక బెంచ్, జూనియర్ సివిల్ జడ్జి పిఎస్‌విబి కృష్ణసాయి తేజ అధ్యక్షతన రెండో బెంచ్ ఏర్పాటు చేసి కేసులు పరిష్కరించారు. 11 సివిల్ కేసులు, 150 క్రిమినల్ కేసులు, 8 భార్యాభర్తలు తగాదాలు, 6 చెక్ బౌన్స్ కేసులు పరిష్కారమయ్యాయి. లోక్ అదాలత్ బెంచ్‌లో న్యాయవాది సభ్యులు వైఎస్ శ్రీనివాస్, కె కొండలరావు ఉన్నారు.

బొబ్బిలి : స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 762 కేసులను రాజీ చేసి పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణిరావు లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్ కేసులు 18, ఇపి కేసులు 10, పిలుపు దావా ఒకటి, చెక్ బౌన్స్ కేసులు 5, మనోవర్తి కేసులు 3, డొమెస్టిక్ వైలెన్స్ కేసులు 2, సిసి కేసులు 143, ఎస్‌టిసి కేసులు 563, బిఎస్ఎన్ఎల్ కేసులు 17 రాజీ చేసి పరిష్కరించారు.

శృంగవరపుకోట : స్థానిక కోర్టులో శనివారం జూనియర్ సివిల్ జడ్జి కుమారి సబ్బవరపు వాణి అధ్యక్షతన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ ద్వారా 375 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. వీటిలో సివిల్ కేసులు 16, చెక్ బౌన్స్ కేసులు 13, మనోవర్తి కేసులు రెండు, క్రిమినల్ కేసులు 344 ఉన్నాయి. బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన కక్షిదారులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు జి.సూర్యదేముడు, కార్యదర్శి బి.సత్యనారాయణ, లోక్ అదాలత్ సభ్యులు బి.సత్యనారాయణ, జి.చిట్టిబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కొమరాడ

ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నీలకంఠం తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరం మండలం నిడగల్లు గ్రామానికి చెందిన కుప్పిలి పాపారావు (34) కొమరాడ మండలంలోని తోటపల్లి నిర్వాసిత గ్రామమైన పాత గుణానపురంలో రచ్చబండపై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పార్వతీపురం రూరల్ సిఐ ఎస్ గోవిందరావు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని క్లూస్ టీమ్ పరిశీలించింది. పోస్టమార్టం నిమిత్తం మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారిపై భోగాపురం గ్రామ సచివాలయం-2 ఎదురుగా శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఇందులో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం.. భోగాపురం పంచాయతీలోని యాతపేటకు చెందిన బాడితిమాని రాముడు రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి నరసన్నపేట వైపు వెళ్తున్న స్కూటీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాముడికి తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీపై వెళ్తున్న భార్యాభర్తల్లో భర్తకు తీవ్రగాయాలు కావడంతో సుందరపేట హాస్పిటల్‌కి తరలించారు. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

లారీ బోల్తా

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారిపై నేతివిందు హోటల్ ఎదురుగా కాలువలోకి లారీ బోల్తా పడింది. అయినప్పటికీ లారీ డ్రైవర్ ఈ ప్రమాదం నుంచి చాక చక్యంగా తప్పించుకున్నాడు. ఈ సంఘటన శనివారం వేకుజామున జరిగింది. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖకు లోడుతో వెళ్తున్న లారీలో డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో రహదారి పక్కనున్న రైలింగ్‌ను ఢీకొని కాలువలోకి బోల్తా పడింది. కాలువలో నీరు ఉండడంతో ఒక్కసారిగా మేల్కొన్న డ్రైవర్ ప్రమాదం నుండి తప్పించుకున్నాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పొట్టేలు పందేలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండువ గ్రామానికి సమీపంలో శనివారం వేకువ జామున వచ్చిన సమాచారం మేరకు పొట్టేల పందేలపై దాడులు నిర్వహించగా రెండు పొట్టేలతో పాటు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జి. కళాధర్ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.3,260లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎక్కడైనా పందాలు,పేకాట ఆడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయనతో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

33 పశువులు స్వాధీనం

ప్రజాశక్తి-పాచిపెంట

ఒడిశా నుంచి మానాపురం సంతకు కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 33 పశువులను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట సురేష్ తెలిపారు. ఒడిశాలోని కుందిలి గ్రామం నుంచి కర్ణాటకకు చెందిన డ్రైవర్లు సాహిద్ ముస్తక్, సయ్యద్ ఇస్మాయిల్ అనుమతులు లేకుండా కంటైనర్‌లో పశువులను తరలిస్తున్నారు. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా కంటైనర్‌ను పోలీసులు తనిఖీ చేశారు. 33 పశువులను కొత్తవలస గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. డ్రైవర్లతోపాటు కంటైనర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

స్కూటీ చోరీ

24 గంటల్లో పట్టుకున్న పోలీసులు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద చోరీకి గురైన ఛార్జింగ్ స్కూటీని పోలీసులు 24 గంటల్లో స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన నిందితుడిని అరెస్ట్ చేశారు. మండలంలోని ఎం.బూర్జవలస గ్రామానికి బైక్ మెకానిక్ కోల వాసు కుమారుడు రాజాం జిఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్నాడు. కళాశాలకు వెళ్లేందుకు శుక్రవారం స్కూటీపై బయల్దేరి ఉదయం 6.30 గంటల సమయంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద పార్కింగ్ చేశాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి స్కూటీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు క్రైం కానిస్టేబుల్స్ చలపతి, లక్ష్మణరావు సిసి పుటేజీలను పరిశీలించారు. పార్వతీపురం మండలం జమడవలస గ్రామానికి చెందిన గొట్టాపు రామకృష్ణను పట్టుకుని స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. వ్యవసాయ కూలి పనులు చేసుకునే రామకృష్ణ తాగుడికి బానిస కావడంతో చిల్లర దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. 24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.

ఆరోగ్య సమస్యలపై తక్షణమే స్పందించాలి

జూమ్ కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ డిఎంహెచ్ఒ జగన్మోహనరావు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేరువయ్యే దిశగా నిశితమైన క్షేత్ర స్థాయి పర్యవేక్షణ అవసరమని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు జిల్లాలో ఆరోగ్య పర్యవేక్షకులకు (సూపర్వైజర్స్) శనివారం జూమ్ కాన్ఫరెన్స్ సమావేశం జరిపి పలు సూచనలు చేశారు. పలు ఆరోగ్య సమస్యలకు అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలు ప్రజలకు సకాలంలో అందేలా ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలని, సిబ్బంది మధ్య సమన్వయ లోపం లేకుండా చూసుకోవాలని, ప్రజల ఆరోగ్య విషయమై సమస్యలు గుర్తించి తక్షణమే స్పందించాలని అన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు క్షేత్రస్థాయికి ఆరోగ్య కేంద్రాలకు మధ్య వారధులగా ఉండి ఆరోగ్య సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈనెల 17న నిర్వహించనున్న డీ వార్మింగ్ కార్యక్రమానికి కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఏడాది నుంచి 19ఏళ్ల వరకు అందరి పిల్లలు, విద్యార్థులకు ఆరోజు ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. బాలికల్లో రక్తహీనత నివారణే ధ్యేయంగా 10 నుంచి 19ఏళ్ల వారికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి వివరాలు రికార్డులో నమోదు చేయాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంత ప్రజలు జ్వరాల బారిన పడకుండా, వైద్య అవసరాల నిమిత్తం ప్రయాసలేకుండా అక్కడే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స అందించాలన్నారు. పిఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా వివిటిజి గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు, వెల్నెస్ కేంద్రాలకు సుదూరంగా ఉన్న గ్రామాలను గుర్తించి అవసరమైన మందులు, పరీక్షలు అక్కడ వైద్య సిబ్బంది వద్ద ఉంచి ప్రతి నెలా ఆ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆ ప్రాంతంలో నివసించే గర్భిణీలను ప్రసవ తేదీకి ముందుగానే గర్భిణీ వసతి గృహాల్లో చేర్చాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తుల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి వారి ఆరోగ్య మెరుగునకు కృషి చేయాలన్నారు. అంకిత భావం, సేవా దృక్పథం అలవర్చుకోవాలని హితవు పలికారు



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న డిడి రుక్మాంగదయ్య: పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉత్సాహంగా ఉపాధ్యాయుల ఆటల పోటీలు

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా శనివారం పార్వతీపురం శివారు కాలనీలోని ప్లే ఫిట్ ఇండోర్ స్టేడియంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గిరిజన సంక్షేమ శాఖ డిడి రుక్మాంగదయ్య చేతుల మీదగా ప్రారంభమయ్యాయి. షటిల్ క్యారమ్స్ చెస్ క్రికెట్, పోటీలకు గానూ పలు జట్లు కు చెందిన క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మురళీమోహన్రావు మాట్లాడుతూ అక్టోబర్ 20, 21 తేదీల్లో జిల్లా స్వర్ణోత్సవం జరుగుతాయని, సామాజిక స్పృహ లో భాగంగా ఈ ఆటల పోటీలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. అనూహ్యంగా ఈ పోటీలకు విపరీతమైన ఆదరణ లభించడం సంతోషించ దగ్గ విషయమని తెలిపారు. జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో అక్టోబర్ 4,5 తేదీల్లో ఆటల పోటీలు జరుగుతాయన్నారు. ఇక్కడ ప్రథమ స్థానంలో నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్తారని అన్నారు. ఆదివారం జరిగే పోటీల్లో మహిళా టీములు పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో కె.జగన్మోహ్మనరావు, కె.మురళి, ఎన్.శ్రీను, పి.వెంకట నాయుడు పాల్గొని సహకరించారు.

మహిళలపై లైంగిక వేధింపులు ఆపాలి

వీరఘట్టం : మహిళలపై లైంగిక వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర అన్నారు. శనివారం వీరఘట్టంలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళలకు రక్షణ లేకుండా పోతుం దన్నారు. శ్రామిక మహిళకు పని జరిగిన చోట రక్షణ కల్పించాలని, పిహెచ్‌పి, ఇయుపి హెచ్‌సి ప్రభుత్వాసుపత్రిలో లైంగిక వేధింపులు నిరోధక కమిటీ సభ్యులను నియమించాలని, 2013లో శ్రామిక మహిళలకు రక్షణ కల్పించేందుకు లైంగిక వేధింపుల కమిటీనినియమించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేశారని గుర్తు చేశారు. అనంతరం ఆశా వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా జి.నీలిమ , కార్యదర్శులు యశోద, అరుణ, కమిటీ సభ్యులుగా కృష్ణవేణి, హైమ, సుందరి, సావిత్రి ఆదిలక్ష్మిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్ సింహాచలం తదితరకార్యకర్తలు పాల్గొన్నారు.

సస్యరక్షణతో పంటలను కాపాడుకోవచ్చు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ముంపునకు గురైన కూరగాయల పంటలను రక్షించుకొనేందుకు కొన్ని చర్యలు చేపట్టడం వల్ల పాదులను, మొక్కలను కాపాడుకోవచ్చని మండల ఉద్యాన శాఖ అధికారి వై.క్రాంతికుమార్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూవర్షాలు అధికంగా కురవడం వల్ల లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడి కూరగాయలు వంటి ఉద్యాన పంటల్లో నీరు నిలబడి ముంపునకు గురై నష్టం వాటిల్లుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో అధిక తేమ వల్ల వేర్ల ద్వారా మొక్క అవసరమైన పోషకాలను తీసుకోలేదన్నారు. మొక్కలు ఉరకెత్తి తలలు వాల్చుతాయని, పంటలను తెగుళ్ల ఆశించడమే కాకుండా సూక్ష్మధాతు లోపాలు కూడా ఎక్కువగా కనబడే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో పంట దశ, ముంపు ఉధృతిని బట్టి తగిన జాగ్రతలు పాటించినట్లైతే పంటను రక్షించుకొని నష్టాన్ని కొంతవరకు తగ్గించుకొనే అవకాశం ఉందన్నారు. ముంపుకు గురైన కూరగాయల పంటలు, కాపుతో వుండి వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ల చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు. నారు అందుబాటులో ఉన్నట్లయితే లేత తోటల్లో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తమొక్కలు నాటుకోవాలని, పంట బాగా ముంపునకు గురై అధిక శాతం మొక్కలు చనిపోయినట్లేతే, పంటను పూర్తిగా తొలగించి నేల అదునుకు వచ్చిన తర్వాత అనుకూలమైన పంటలను వేసుకోవాలని సూచించారు. నేల అదునుకు వచ్చిన వెంటనే అంతర కృషి చేసి, అదనంగా యూరియా, పొటాష్, వేపపిండి వేయాలన్నారు. మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమం (19-19-19) 5గ్రాములు, మెగ్నీషియం సల్ఫేట్ 5గ్రాములు, సూక్ష్మ పోషకాల మిశ్రమం 2.5గ్రాములు లీటరు నీటికి ఒక దాని తర్వాత ఒకటి వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. పంటకు ఆకుమచ్చ, కాయకుళ్లు, బూజు తెగుళ్ల ఉధృతి అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. కావున ముందు జాగ్రత్త చర్యగా లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెబ్ కార్బండిజమ్ మందును కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. వేరుకుళు ఆశించకుండా చేలల్లో పది లీటర్ల నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30గ్రాములు, లేదా కార్బండిజమ్ 10 గ్రామలు చొప్పున కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలని తెలిపారు.



వర్షాలకు దెబ్బతిన్న కూరగాయల పంటలు



అన్న క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

18న అన్న క్యాంటీన్ ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు వద్ద అన్న క్యాంటీన్‌ను ఈనెల 18న ప్రారంభిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మున్సిపాల్టీ పరిధిలో గల అన్న క్యాంటీన్‌ను సందర్శించి పూర్తి అయిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 18న అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామన్నారు. పేద ప్రజలకు ఐదు రూపాయలకే భోజనం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఇ సన్యాసిరావు, ఎమినిటీ సెక్రటరీలు మహేష్, శ్రీను పాల్గొన్నారు. అనంతరం శనివారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మున్సిపల్ సిడిఎం ఎ.హరి నారాయణతో జరిగే వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ప్రజారోగ్య పరిరక్షణకు మున్సిపల్ పరిధిలో పలు కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్‌తో పాటు హెల్త్ అసిస్టెంట్ రామారావు, ఎఫ్ 1పద్మావతి, శానిటేషన్ సెక్రెటరీ గణేష్, ఆపరేటర్ రాజేష్ పాల్గొన్నారు.

హిందీ పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో హిందీ ప్రచారసభ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విశారద, భూషణ్, విద్వాన్ పరీక్షలకు 57మందికి 53 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ టి.శంకరరావు, కురుపాం హిందీ కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్ కుమార్ తెలిపారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

'ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా రఘువర్మ మళ్లీ పోటీ'

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

2025 మార్చిలో జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా ఎపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు పాకలపాటి రఘువర్మ పోటీ చేస్తారని ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మహేష్, ఎన్.బాలకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి నేటి వరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సభ్యునిగా రఘువర్మ చేసిన కృషిని వీరు అభినందించారు. నేటి వరకు ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల్లోని ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాన్ని అనుసరిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారన్నారు. కావున ఆయనకు సహకరించాలని కోరారు.

నేత్రవైద్య పితామహుడు డాక్టర్ శివారెడ్డి

ప్రజాశక్తి - కురుపాం

నేత్ర వైద్య పితామహుడు డాక్టర్ పెరుగు శివారెడ్డి సేవలు అద్భుతమని జిల్లా నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర నేత్ర వైద్య అధికారుల సంఘం ఘనంగా నివాళులర్పించి అతను చేసిన సేవలు గుర్తు చేసుకొని అతను అడుగు జాడల్లో సేవలు చేయాలని నిర్ణయించారని అన్నారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వనిజ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల క్రీడా ప్రతిభ

జియ్యమ్మవలస : మండలంలోని వనిజ గిరిజన ఆశ్రమోన్నత బాలుర పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి ఆటల పోటీల్లో వనిజ పాఠశాలకు చెందిన అండర్ 14 విభాగంలో ఖోఖో లో యు.వర్ధన్, కె రవి, వాలీబాల్ పోటీలో కె. రామయ్య, బి. గిరి తమ ప్రతిభను చాటారు. అండర్-17లో కబడ్డీలో యు ప్రభాస్, ఖోఖో విభాగంలో కె.వంశీ, కె.నారాయణ, ఎం.రామ్‌చరణ్ ప్రతిభ కనబర్చారు. దీంతో వీరంతా నియోజకవర్గస్థాయికు పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అల్లు రవి ప్రసాద్ తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి నియోజకవర్గం స్థాయికి చేరుకోవడం తమకెంతో ఆనందంగా ఉందని పాఠశాల హెచ్‌ఎం, సిబ్బంది తెలిపారు.





వంగర.. ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, తదితరులు ; విజయనగరంలో నివాళులర్పిస్తున్న అంగన్వాడీలు

ఏచూరి మరణం కార్మికవర్గానికి తీరనిలోటు

ప్రజాశక్తి-వంగర

కమ్యూనిస్టు ఉద్యమ నేత, ప్రజాపోరాట యోధుడు, సిపిఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి కార్మికవర్గానికి తీరని లోటని పలువురు నాయకులు అన్నారు. ఏచూరి మృతికి సంతాపంగా జిల్లాలో శనివారం పలుచోట్ల నివాళులర్పించారు. వంగర మండల కేంద్రంలో ఏచూరి చిత్రపటం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణ, సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం సూర్యనారాయణ మాట్లాడుతూ అగ్రకులంలో పుట్టి పేద ప్రజల కోసం పనిచేసిన గొప్ప దార్శినికుడు ఏచూరి అని, ఆయన ఆశయ సాధన కొనసాగించడమే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్, వివిధ ప్రజా సంఘాల నాయకులు మజ్జి గణపతి, డర్రు రాంబాబు, సిఐటియు నాయకులు పి.విశ్వనాథం, ఎం.త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : విజయనగరంలోని ఎల్‌బిజి భవనంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ విజయనగరం కార్పొరేషన్ కమిటీ, అర్బన్ ఆశ వర్కర్స్ యూనియన్, ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి, పైడిరాజు మాట్లాడారు. ఏచూరి మృతి కార్మిక వర్గానికి , దేశ ప్రజానికానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆశయ బాట లో పయనిస్తామని తెలిపారు. వైఎస్ఆర్ కాలనీలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి భాస్కరరావు, లంకా పట్నంలో ఆశా వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మహాలక్ష్మి, జొన్న గుడ్డిలో స్కూల్ ఆయాల సంఘం కార్యదర్శి నందిని, గాజులురేగలో మున్సిపల్ యూనియన్. నాయకులు సూరి అధ్వర్యంలో సంతాపం తెలిపారు.

కార్మిక రాజ్య స్థాపనకు కృషి చేయడమే ఏచూరికి నివాళి

కార్మిక పక్ష పాతి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని కార్మిక రాజ్య స్థాపనకు కృషి చేయడమే ఆయనకు కార్మిక వర్గం ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం జిల్ల కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అన్నారు .సీతారాం ఏచూరి మరణం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరనిలోటని అన్నారు. కళాసీ సంఘం ఆధ్వర్యంలో ఏచూరి సంతాప సభ కోట వద్ద శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏచూరిని ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలు కోసం, సమసమాజం కోసం కృషి చేయడమే నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో మేస్త్రీ రాజు కార్మికులు పాల్గొన్నారు.

ఏచూరికి మున్సిపల్ వర్కర్స్ సంతాపం

నెల్లిమర్ల : సిపిఎం అగ్రనేత సీతారాం ఏచూరి మృతికి శనివారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుల కిల్లంపల్లి రామారావు, యూనియన్ నాయకులు బాబురావు, హరిబాబు, శ్రీను, రాము, లక్ష్మీలు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

రేగిడి: ఏచూరి మృతి తీరని లోటు అని ఉణుకూరు సిఐటియు నాయకులు ఎం త్రినాధ, తిరుపతిరావు, పోరెడ్డి విశ్వనాథం అన్నారు. సిపిఎం నాయకులు, రైతు సంఘం నాయకులు, టిడిపి సీనియర్ నాయకులు నారు జనార్దనరావు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దోసరిలో సీతారాం ఏచూరికి ఘనంగా నివాళు లర్పించారు. కె.శంకరరావు, రమణమూర్తి పార్టీ సభ్యులు పాల్గొన్నారు.


వరద బాధితులకు మాజీ సైనికుల విరాళం

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయవాడ వరద బాధితులను ఆదుకొని తమ వంతు సహాయాన్ని అందించేందుకు మాజీ సైనికులు ముందుకు వచ్చారు. జిల్లాలోని నేతాజీ మాజీ సైనికుల సంఘం సభ్యులు వరద బాధితుల సహాయార్థం రూ.1,00,123 విరాళంగా అందజేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును సంఘం ప్రతినిధులు శనివారం జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు పి.గుణాకర్, ఉపాధ్యక్షుడు ఎస్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధికి రూ.2.47లక్షల విరాళం

రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకొనేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2,47,435 విరాళాన్ని ఎంఎల్‌ఎ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అందించారు.



కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న మాజీ సైనికులు

దీనికి సంబంధించిన చెక్కును రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చేతులమీదుగా కలెక్టర్ అంబేద్కర్‌కు శనివారం ఆయన ఛాంబర్లో అందజేశారు. ఈ మొత్తంలో అద్దేపల్లి విజయలక్ష్మి రూ.10,000, హోల్‌సేల్ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ రూ.1,00,000, విజయనగరం పట్టణంలోని 1వ వార్డు అయ్యప్పనగర్ చిన్నారులు రూ.5,312, 5వ వార్డులోని మహిళా కార్యకర్తలు రూ.32,000, నేతాజీ ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ రూ.1,00,123 సమకూర్చినట్లు ఎంఎల్‌ఎ అదితి విజయలక్ష్మి తెలిపారు.

భూ సమస్యపై గిరిజనుల వినతి

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని ఆంధ్ర, లోతుగెడ్డ గ్రామాల్లో గిరిజనుల భూ సమస్యను పరిష్క రించాలని గిరిజన సంఘం నాయకులు. ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావును కోరారు. చైర్మన్ క్యాంపు కార్యాల యంలో శనివారం ఆయన్ను గిరిజనులు కలిసి వినతి అందిం చారు. గిరిజనులతో చేపల సొసైటీ ఏర్పాట ుచేసి, చేపలు పెంచి, పట్టుకుని ఉపాధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వంతు రాంబాబు, ప్రకాశ్, నరవ అప్పన్న దొర, రాకోటి రాములు, తదితరులు కోరారు. దీనిపై చైర్మన్ సానుకూలంగా స్పందించి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.



ఎస్‌టి కమిషన్ చైర్మన్ శంకరరావుకు వినతి అందిస్తున్న గిరిజనులు



ధర్నా చేస్తున్న కార్మికులు

పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కల్పించండి

పరిశ్రమల శాఖ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు భద్రత కల్పించాలని ఎఐఎఫ్‌టియు నాయకులు బెహరా శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం పరిశ్రమల తనిఖీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇటీవల పరవాడ ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఎసెన్షియా, సినర్జిన్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో 22 మంది మరణించిన విషయం తెలిసిందే అన్నారు. పరిశ్రమల్లో కార్మికులకు భద్రత లేకుండా పోయిందన్నారు. కార్మికులకు రక్షణ కల్పించే చట్టాలు అమలు చేయకపోవడం వలన కార్మిక కుటుంబాలకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్మికులకు రక్షణ కల్పించి, పని చేసే చోట ప్రాణ హానీ జరగకుండా భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు అప్పలరాజు, అప్పలరాజు, సోమరాజు కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ఐక్యతకు క్రీడలు దోహదం

ప్రజాశక్తి- రాజాం

క్రీడలు ఉపాధ్యాయుల ఐక్యతకు దోహదం చేస్తాయని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా రాజాం డివిజన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు వాలీబాల్ పోటీలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు శారీరక వ్యాయామంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ పోటీలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు బెవర శంకర్రావు ప్రారంభించారు. వాలీబాల్ పోటీలలో వంగర మండలం ప్రథమ, రేగిడి టీమ్ ద్వితీయ బహుమతి పొందాయి. మహిళా ఉపాధ్యాయులకు షటిల్, లెమన్ స్పూన్ మొదలగు ఆటలను ఆడించారు. వివిధ ఆటలలో గెలుపొందిన బిహెచ్ మాధురి. జీ రమణమ్మ, సుష్మ ఆర్ సులోచన, పి. పద్మ, వి.ఉషారాణి, విజయమ్మ తదితరులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహన్ రావు, జిల్లా కార్యదర్శులు సత్తి వాసు, బాణాల రామినాయుడు, జిల్లా ఆడిట్ కమిటీ వెంకటప్పనాయుడు, గేదెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


రాజాంలో మాట్లాడుతున్న కె. విజయగౌరి

గరివిడి: యుటిఎఫ్ వార్షోత్సవాల సందర్భంగా చీపురుపల్లి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు శనివారం స్థానిక ఫుట్ బాల్ గ్రౌండ్‌లో నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు మీసాల అప్పలనాయుడు, జిల్లా కార్యదర్శి సూరి శ్రీనివాసరావు, మూడు మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో క్రికెట్ విన్నర్‌గా చీపురుపల్లి, రన్నర్‌గా మెరకముడుదాం, వాలీబాల్ పోటీల్లో విన్నర్స్‌గా మెరకముడిదాం, రన్నర్స్‌గా గరివిడి మండలం విజయం సాధించాయి. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, మండలాల ప్రతినిధులు ఎం.రఘునాథరాజు, రమేష్, చంద్రశేఖర్, సతీష్, లక్ష్మణ్, సత్యనారాయణ, రమణ, మామిడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: యుటిఎఫ్ స్వర్ణోత్సవాలలో భాగంగా నియోజకవర్గంలోని ఉపాధ్యాయులకు శనివారం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు ప్రారంభించారు. పీడీ పి.శ్రీరాములు ఆధ్వర్యాన షటిల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, చెస్, క్యారమ్స్ తదితర పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జివి రమణ, గౌరవ అధ్యక్షులు వివిఎస్ దేవుడు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణ, ఎ.శ్రీనివాస్, సీనియర్ నాయకులు వెంకట్రావు, సత్యనారాయణ, ఎ.రాము పాల్గొన్నారు.

స్టాఫ్‌నర్సులే వైద్యులు

ప్రజాశక్తి - వీరఘట్టం

జీవో నెంబరు 85ను రద్దు చేయాలని కోరుతూ శనివారం వైద్యాధికారులు సేవలు కొనసాగించకపోవడంతో స్టాఫ్ నర్సులే వైద్యాధికారుల అవతారమెత్తి ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారంతోపాటు జీవో నెంబర్ 85ను రద్దు చేయాలని పలు రకాలుగా వైద్యాధికారులు నిరసనలు చేస్తున్న విషయం తెలిసిందే.


రోగికి తనిఖీ చేస్తున్న నర్సు


చెత్త పోగులను తొలగించిన తరువాత వసతి గృహం

వసతి గృహంలో చెత్త తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- రాజాం

ప్రభుత్వ బాలికల వసతి గృహం కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆగస్టు 26న అధ్వానం.. బాలికల వసతి గృహం అని ప్రజాశక్తి దినపత్రికలో కథనం వెలువడింది. ఈ కథనానికి జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు స్పందించారు. విద్యార్థినిలకు మెనూ సక్రమంగా అమలు చేయాలని, వసతి గృహం శుభ్రంగా ఉంచాలని వార్డెన్‌కు సూచించారు. ఈ మేరకు హాస్టల్ ఆవరణంలో ఉన్న బాత్ రూమ్‌లు, కలుపు మొక్కలతో పాటు చెత్త చెదారాన్ని వార్డెన్ శనివారం శుభ్రం చేయించారు. దీంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు.

వారం రోజులుగా తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొండల మామిడివలస గ్రామస్తులు గత వారం రోజుల నుంచి తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో సుమారు 900 కుటుంబాలున్నాయి. తాగునీరు లేక కలుషితమైన నేల బావుల నుంచి నీరు తెచ్చుకుని దాహాన్ని తీర్చుకుంటున్నారు. నాగావళి నది పైలెట్ ప్రాజెక్టు నుంచి ఇంటింటికి కుళాయి వేసినప్పటికీ గత వారం రోజులుగా తాగునీటి ఇబ్బందులు తప్పలేదు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


నీటి కోసం ఎదురుచూపు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

లప్పటిలో గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని లుంబేసు పంచాయతీ కొండ శిఖర గ్రామమైన లప్పటిలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. గిరిజనుల నుంచి రక్త నమూనాలు తీసి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వాడకం చేయాలని, కాచి మరగపెట్టిన నీటిని తాగాలని భద్రగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి జై మోహన్ రావు గిరిజనులకు సూచించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటిఎస్ కేశవ నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంపిహెచ్ఎ రామకృష్ణ ఉన్నారు.

వరద బాధితులకు రూ.5 లక్షలు విరాళం

ప్రజాశక్తి- రాజాం

ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ పిలుపు మేరకు విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు రాజాం మండలం రూరల్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు టిడిపి క్యాంపు కార్యాలయంలో రూ.4లక్షల ఎమ్మెల్యేకు అందజేశారు. రాజాం టౌన్‌లో గల శాస్త్రా సమాజం తరపున శేసు గురుస్వామి ఆధ్వర్యంలో రూ.36,803 చెక్కును అందజేశారు. రాజాం జ్యూవలరీ అసోసియేషన్ తరపున రూ.51వేల చెక్కును అందజేశారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన డీలర్ల నూతన కార్యవర్గం సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని నూతన కార్య వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ అధ్యక్షులు నంది సూర్యప్రకాశరావు, టంకాల కన్నం నాయుడు, పొట్నూరు లక్ష్మణ, డీలర్ల సంఘం అధ్యక్షులు ఉరిటి సురేంద్ర, సామంతుల సూర్యనారాయణ పాల్గొన్నారు.

బొబ్బిలి: వరద బాధితుల కోసం సిఎం సహాయనిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే బేబినాయన పిలుపుతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు, ఉద్యోగులు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. మున్సిపాలిటీలోని 14వ వార్డు అప్పయ్యపేట, పూల్ బాగ్ ప్రాంత పెద్దలు రూ.1.45 లక్షలు, ఇందిరమ్మ కాలనీ పెద్దలు రూ.64 వేలు, మణికంఠ బిల్డర్స్ ప్రతినిధులు పి.ప్రభాకరరావు, జి.భాస్కరరావు రూ.50 వేలు, చింతాడ మాజీ ఎంపిటిసి జయప్రదీప్, గ్రామపెద్ద కృష్ణంనాయుడు రూ.45 వేలు, హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.27 వేలు, అమ్మ ఆసుపత్రి వైద్యులు కె.హరిప్రసాద్ రూ.25 వేలు, రెడ్డి రమేష్ రూ.20 వేలు, కొప్పల వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు రూ.లక్ష, ఎన్ఆర్‌వి ఆసుపత్రి యాజమాన్య ప్రతినిధులు రూ.20 వేలు విరాళాలను బేబినాయనకు అందజేశారు. వీరిని బేబినాయన అభినందించారు.

వరద బాధితులకు ఆర్‌టిసి సిబ్బంది సహాయం

శృంగవరపుకోట: విజయవాడ వరద బాధితులకు శృంగవరపుకోట డిపో మేనేజర్ కె.రమేష్, సిబ్బంది, స్థానికుల సహకారంతో టన్ను బియ్యాన్ని శుక్రవారం రాత్రి బస్సులో తరలించారు. విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లోని అవుట్ సోర్సింగ్ సిబ్బందికి 25 కిలోల బ్యాగులను పంపిణీ చేశారు.


బొబ్బిలి: విరాళాలు అందిస్తున్న ఇందిరమ్మకాలనీ వాసులు

సీతానగరం: మండలంలోని టిడిపి పిలుపు మేరకు విజయవాడ వరద బాధితులకు జోగుంపేట గ్రామానికి చెందిన బొమ్మలేని లక్ష్మణరావు, టెంక శ్రీనివాసరావు రూ.5వేలు, దయానిధిపురం సర్పంచ్ చంటి రామారావు రూ.5వేలు, బగంతరవలస గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రూ.10వేలు, అంటిపేట గ్రామానికి చెందిన పైలా నాగభూషన్ రూ.10వేలు, బూర్జ మాజీ సర్పంచ్ ఎన్. జ్యోతిచంద్రశేఖర రావు, ఈ దిబ్బిల్ బలరాం నాయుడు రూ.9వేలు సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు రౌతు వేణుగోపాలనాయుడు, సత్యంనాయుడు పాల్గొన్నారు.

అవంతిలో ఘనంగా వన మహోత్సవం

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో వన మహోత్సవం శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కాలేజీ ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని పెంచడం, సంరక్షించడం సామాజిక బాధ్యత అని తెలిపారు. చెట్లను కొట్టేయడం వల్ల వాతావరణంలో సమతుల్యత లోపించి, సకాలంలో వర్షాలు పడడం లేదని, ఎండలు ఎక్కువగా కాస్తున్నాయని, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని కోరారు. ప్రతీ విద్యార్థి ఇంటి ఆవరణంలో మొక్కలును నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. అనంతరం విద్యార్థుల చేత వృక్షో రక్షితి రక్షిత: అని ప్రతిజ్ఞ చేయించి, పచ్చదనం మన ప్రగతికి సంకేతం అని సూచించి 100 మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.వెంకటరమణ, ఎఒజి అనిల్ కుమార్, ఎన్ఎస్-ఎస్ సమన్వయకర్తలు ఎస్.సత్యం, ఆర్.శివ, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, అధ్యాపకులు

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను పార్వతీపురంలో ఆపాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నియోజకవర్గ ప్రజలతో పాటు మూడు జిల్లాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రాధాన్యత కలిగిన పార్వతీపురం స్టేషన్‌లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర కోరారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి బెంగుళూరులో రైల్వే కేంద్ర సహాయక మంత్రి సోమన్నను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి కేంద్ర బిందువైన పార్వతీపురం రైల్వే స్టేషన్ పరిధిలో మూడు జిల్లాల ప్రజలు రోజు ప్రయాణం చేస్తుంటారని, వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఇక్కడ హాల్ట్ కల్పించడం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, సాంకేతిక కారణాలు చూపించి ఎంతో ప్రాధాన్యత గల పార్వతీపురంలో హాల్ట్ లేకుండా చేయడం సరైనది కాదని చెప్పారు. దీని వల్ల ఇక్కడ ప్రజలు ఎంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారని వెంటనే హాల్ట్ కల్పిస్తున్నట్లు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మంత్రిని కోరానని, ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే హాల్టు వచ్చేటట్లు కృషి చేస్తానని మాట ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

17న నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈ నెల 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నేపథ్యంలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ఎస్ చలమయ్య, డాక్టర్ రీనా చౌదరి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జాతీయ నులిపురుగుల దినోత్సవానికి సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్వాడీ కేంద్రాలలోనూ 6 నుంచి 19 ఏళ్ల బాల బాలికలకు పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. విధిగా ఈ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రాధాకృష్ణ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పోస్టల్ పెన్షన్‌దారులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం పార్వతీపురం డివిజన్ కార్యదర్శి వెంకటాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పోస్టల్ సూపరింటెండెంట్ బాబు రావుని సంఘ సభ్యులతో కలిసి వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాత పెన్షన్ పథకం అమలు చేయాలని, 2003 డిసెంబరు 22 ముందు వచ్చిన నోటిఫికేషన్ ప్రకారం రిక్రూట్ అయిన వారు ఓపిఎస్ ఎంచుకున్నట్లయితే వారి నుంచి ఎటువంటి బకాయిలు వసూలు చేయరాదని, ఎన్‌పిఎస్ పెన్షనర్లకు సిజిహెచ్‌ఎస్ వర్తింపజేయాలని, ఎనిమిదో వేతన సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. 18 నెలల డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని, బిఎస్ఎన్ఎల్ పింఛను దారులకు వెంటనే పింఛను రివిజన్ చేయాలని, బ్యాంక్ పింఛనదారులకు కూడా వెంటనే పింఛను రివిజన్ చేయాలని, కమ్యుటేషన్ పిరియడ్, 15 సంవత్సరాల నుంచి 10.8 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు.





బలిజిపేట, వీరఘట్టంలో సీతారాం ఏచూరి చిత్రపటాల వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ఏచూరి మృతి ప్రజాఉద్యమాలకు తీరని లోటు

ప్రజాశక్తి - వీరఘట్టం

దేశం గర్వించదగ్గ కమ్యూనిస్టు ఉద్యమ నేత సీతారాం ఏచూరి అని, ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి .ఇందిర అన్నారు. వీరఘట్టంలో శపివానం ఆమె సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిపిఎం అభివృద్ధికి ఎనలేని కృషి చేసిన నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. నిబద్ధతతో పార్టీ కోసం పనిచేసిన ఏకైక నాయకుడని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సిపిఎం పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మండల సిపిఎం నాయకులు ఎన్.సింహాచలం, ఐద్వా నాయకులు సిహెచ్ చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల నివాళులు

పాచిపెంట : మండలంలోని వేటగానివలస జంక్షన్‌లో సిపిఎం సీనియర్ నాయకులు సూకురు అప్పలస్వామి అధ్యక్షతన ఏచూరి సంస్మరణ సభ జరిగింది. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ ఏచూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే అందరి కర్తవ్యమన్నారు. సిపిఎం నాయకులు కొర్ర కళ్యాణ్, రామారావు, శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని చిన బోగిలిలో సీతారాం ఏచూరి సంతాపం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఏచూరి మరణం పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడమే ఆయనకు ఘనమైన నివాళులు అర్పించినట్లని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి ఈశ్వంరావు, బొరపరెడ్డి అప్పారావు, చందనపల్లి కృష్ణ, రామలక్ష్మి సావిత్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : సీతారాం ఏచూరికి ఆదివాసీ మాతృ బహుభాష విద్య వాలంటీర్లు సీతంపేటలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజలు, కార్మిక, కర్షక, చిరు ఉద్యోగుల పక్షాన నిలబడి పోరాటం చేసేవారన్నారు. ఆయన మృతి ఈ వర్గానికే కాకుండా దేశ ప్రజలు తీరని లోటన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ మాతృ బహు బాషా విద్యా వాలంటీర్లు రాష్ట్ర కమిటీ అధ్యక్షులు సవర డోంబు, నాయకులు సవర ఆనందు, ఎల్లంగో, మాసయ్య, ఎం.భారతి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

బలిజిపేట : ప్రజా సంఘాల కార్యాలయంలో ఏచూరి చత్రపటానికి సిపిఎం నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మన్మధరావు , సత్యనారాయణ మాట్లాడుతూ ఏచూరి మృతికి మండల సిపిఎం కమిటీ తీవ్ర సంతాపం ప్రకటిస్తుందని, కమ్యూనిస్టు పార్టీలో గొప్ప మానవతావాది, మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, ఆర్థికవేత్త ఏచూరి అని అన్నారు. జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే రాజకీయ ఎత్తుగడలను రూపొందించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. చూరి జీవితం కమ్యూనిస్టు ఉద్యమానికి ఆదర్శ నిలియమని ఆయన ఆశ సాధన కోసం పార్టీ సభ్యులు సానుభూతిపరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులు బద్దాన భానుమూర్తి అల్లాడ కృష్ణ అప్పలస్వామి దాలమ్మ ప్రమీల లక్ష్మి నులక మజ్జి తదితరులు పాల్గొన్నారు.



ఒపి కోసం నిరీక్షిస్తున్న రోగులు

జిఒ 85కు వ్యతిరేకంగా వైద్యసేవలు బంద్

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నిర్వహిస్తున్న నిరసనలో భాగంగా శనివారం ఓపి సేవలను వైద్యులు బహిష్కరించారు. జీవో 85ను తక్షణమే ఉపసంహరించాలని కొద్ది రోజులుగా వైద్యులు తమ నిరసనను తెలియజేస్తున్నారు. ప్రస్తుతం అత్యవసర ఓపిని మాత్రమే చూస్తున్న వైద్యులు, మరో రెండు రోజుల్లో ఆ సేవలను కూడా నిలిపివేయనున్నారు. తక్షణమే డాక్టర్లకు వ్యతిరేకంగా ఉన్న జీవోను రద్దు చేసి న్యాయం చేయాలని వైద్యులు హరికృష్ణ, కిరణ్ కుమార్, నిఖిల డిమాండ్ చేస్తున్నారు.

భూసేకరణ నిధులు మళ్లింపు

ప్రజాశక్తి - పాలకొండ

రెవెన్యూ అధికారులు తలుచుకుంటే ఏదైనా జరిగిపోతుంది. అత్త సొమ్ము అల్లుడు దానం అన్నచందంగా రెవెన్యూ శాఖ తయారైంది. 2013లో పాతపట్నం మండలం భూసేకరణకు సంబంధించి రూ.14లక్షలు నిధులు సేకరించారు. రైతుల నుంచి వివాదం రావడంతో కోర్టుకు వివాదం చేరడంతో ఆ నిధులు స్థానిక ఆంధ్రా బ్యాంకులో నిల్వ ఉంచారు. 2022లో జిల్లాలు పునర్విభజన జరగ్గా పాలకొండ డివిజన్‌లో ఉన్న పాతపట్నం టెక్కలి డివిజన్‌లో చేరింది. అయితే భూసేకరణకు సంబంధించిన దస్త్రాలు టెక్కలికి పంపించినప్పటికీ నిధులు మాత్రం ఇక్కడ బ్యాంకులోనే ఉంచేశారు. ప్రస్తుతానికి ఆ నిధులు వడ్డీతో రూ.22లక్షలకు చేరింది. అయితే వడ్డీగా వచ్చిన సుమారు రూ.5లక్షల నిధులు ఇక్కడ బ్యాంకు నుంచి విజయనగరం జిల్లా రాజాంలో కొటక్ బ్యాంకుకు మళ్లించారు. ఆర్‌డిఒ పాలకొండ ఖాతాతో నిధులు మళ్లించినప్పటికీ, దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వడ్డీ నగదును ఇక్కడ తీయడమెందుకు, వేరే ఖాతాలో జమ చేయడం ఎందుకన్న చర్చ జరుగుతుంది. దీనిపై సబ్ కలెక్టర్ దృష్టి పెట్టి సమగ్ర దర్యాప్తు చేయాల్సి ఉంది.

వాస్తవమే : స్వర్ణలత ఎఒ, ఆర్డీవో కార్యాలయం

భూసేకరణ నిధులు ఆంధ్రా బ్యాంకులోనే ఉన్నాయి. అయితే వడ్డీ నగదు రాజాం బ్యాంకులో జమ చేసిన మాట వాస్తవమే. భూసేకరణ నిధులు టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తామని చెప్పినప్పటికీ అక్కడ వారు పెద్దగా స్పందించలేదు. దీంతో ఇక్కడే ఉండిపోయాయి.



బట్టివలసలో నాడు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

నాడు వేశారు ... నేడు తీసేశారు

బట్టి వలసలో విద్యుత్ శాఖ గమ్మత్తు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలో నెల రోజుల క్రితం అనధికారకంగా వేసిన విద్యుత్ స్తంభాలను రెండు రోజుల క్రితం మళ్లీ పీకేసిన ఉదంతం వెలుగు చూసింది. ఏం జరిగిందో ఏమో కానీ ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం చేరడంతో వ్యవసాయ కనెక్షన్ల కోసం వేసిన విద్యుత్ స్తంభాలను ఏకంగా తొలగించేశారు. శుక్రవారం ఈ ప్రాంతాన్ని స్థానిక ఎడిఇ శంకంరావు పరిశీలించారు. కార్యక్రమంలో ఎఇ శివశంకర్ పాల్గొన్నారు

ఇదిలా ఉండగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ వెలువడినప్పటి నుంచి ఇప్పటి వరకు విద్యుత్ శాఖ సంబంధించి ఏ విధమైన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ప్రస్తుత ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయలేదు. కానీ మండలంలోని మార్కొండపుట్టి పంచాయతీ పరిధిలో బట్టివలసలో కొత్తగా వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం ఆ శాఖ అధికారులు పనులు చేప ట్టారు. సుమారు నెల రోజుల క్రితమే ఈ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, కొన్నింటికి క్రాష్ ఆర్ములు కూడా బిగించేశారు. ఇక ఆయా స్తంభాలకు విద్యుత్ వైర్లు ఏర్పాటు చేయడం ఒక్కటే మిగిలింది. అయితే సుమారు 6 నెలలుగా విద్యుత్ కనెక్షన్లకు రిజిస్ట్రేషన్లు చేసి విద్యుత్ కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న చాలామంది రైతులు మండలంలో ఉన్నారు. ఇక్కడ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసిన అధికారులు అనుమతుల్లేకుండానే ఏర్పాటు చేశారా లేక ముందస్తుగా ఏర్పాటు చేసుకున్నారా అన్నది పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మిగతావారు ఎవరికీ మంజూరు కానీ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఈ ప్రాంతం వారికే ఎలా మంజూరు అయ్యాయని పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్చ మండల వ్యాప్తంగా జరగడంతో విద్యుత్ శాఖ అధికారులు అనధికారికంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను తొలగించారన్న చర్చ కూడా జరుగుతుంది. ఇందులో ఎంత వరకు వాస్తవమనే జిల్లా అధికారులే తేల్చాల్సి ఉంది.



స్థలపరిశీలన చేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఇన్నోవేషన్ హబ్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఇన్నోవేషన్ హబ్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఇన్నోవేషన్ హబ్ నిర్మాణానికి సర్వే నెం 249/1 లోని ఎ.1.34సెంట్లు స్థలాన్ని గుర్తించినట్లు ఆర్‌డిఒ కె.హేమలత కలెక్టర్‌కు తెలిపారు. స్థలం అనువైనదిగా ఉన్నందున విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ కోర్సు ప్రయోగశాల ఏర్పాటుచేసి సాంకేతిక ఆవిష్కరణలకు ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చుట్టూ పార్క్ అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ టి.వెంకట రమణ, గిరిజన సంక్షేమ శాఖ ఎఇ డి.గౌరు నాయుడు, కళాశాల కామర్స్ అధ్యాపకులు డి.వి.వి.ఎస్.గుప్త, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వి. రామకృష్ణ, సర్వేయర్ కైలాసం, విఆర్ఒ గంగ రాజు, తదితరులు పాల్గొన్నారు..

ఆగని ఇసుక దందా

ప్రజాశక్తి-పాలకొండ

నియోజకవర్గంలో ఇసుక దందా ఇంకా పూర్తిగా ఆగిపోలేదు. మండలంలోని గోపాలపురం ఇసుక రీచ్ నుంచి రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా అవుతుందని తెలుస్తోంది. ఒక్కొక్క లారీ నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఎవరు ఈ రీచ్ నిర్వహణలో ఉన్నారో, ఇసుక ఎక్కడకు వెళ్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక అమలు చేస్తామని చెప్పినప్పటికీ ఆ విధానం అమలు కాకపోవడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఏది ఏమైనా దీనిపై అధికారులు దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఇండియా ఆకృతిలో ఉన్న విద్యార్థులు

ఘనంగా హిందీ దివస్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం హిందీ దివస్ విద్యార్థులతో ఉపాధ్యాయులతో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటల మధ్య పిల్లలు ఆనందంగా జరుపుకున్నారు. విద్యార్థినిలచే హిందీ దివస్ ఇండియా ఆకృతిని నిర్వహించారు. ఈ ఆకృతి పలువుర్ని ఆకట్టుకుంది. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో పదో తరగతికి చెందిన ఎస్ కళ్యాణికి ప్రథమ బహుమతి వచ్చింది. ఆమెను, హిందీ ఉపాధ్యాయులు నీరజ, లక్ష్మణను ప్రధానోపాధ్యాయులు పి.పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యుఒ అమల, ఉపాధ్యాయులు అభినందించారు.

పాలకొండ : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరిగింది. జాతీయ ఐక్యత కోసం ప్రతీ ఒక్కరూ హిందీ భాషను నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయులు మీసాల సూర్యనారాయణ అన్నారు. హిందీఉపాధ్యాయిని సులోచనారాణి హిందీ భాష పుట్టుపూర్వోత్తరాలు వివరించారు. సంస్కృత భాష ఉపాధ్యాయులు బౌరోతు శంకరరావు హిందీభాషకు, సంస్కృతికి ఉన్న సంబంధాన్ని వివరించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



పండగకు హాజరైన యాత్రికులు

కోడూరు పండగకు పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని కోడూరులో శనివారం నిర్వహించిన మేరీమాత పండగకు యాత్రికులు భారీగా తరలివచ్చారు. ఏటా సెప్టెంబర్ రెండో శనివారం కోడూరు మేరీమాత పండగను నిర్వహిస్తుంటారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి కోడూరుకు యాత్రికులు పోటెత్తారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మేరీమాత ఆలయంలో విశాఖపట్నం పీఠాధిపతులు పి.జయరావు, ఫాస్టర్ యుగల్ కుమార్ ఆధ్వర్యాన క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. భక్తులు కానుకలు, తలనీలాలు సమర్పించారు. అధిక సంఖ్యలో జనం తరలిరావడంతో బాడంగి నుంచి కోడూరు వెళ్లే మార్గమంతా కిటకిటలాడింది. ట్రాఫిక్‌కు ఎక్కడా ఇబ్బందులు లేకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు ఆధ్వర్యాన రూరల్ సిఐ నారాయణరావు, ఎస్‌ఐలు తారకేశ్వరరావు, జయంతి, సాగర్‌బాబు, ప్రసాద్, సిబ్బంది బందోబస్తు ఏర్పాటుచేశారు.

విద్యార్థికి జెడ్‌పి చైర్మన్ పరామర్శ

విజయనగరం టౌన్ : బొబ్బిలిలోని ఎపి రెసిడెన్షియల్ స్కూల్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకుని తిరుమల మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పదో తరగతి విద్యార్థి కె.హర్షవర్ధన్‌ను శనివారం జెడ్‌పి చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు పరామర్శించారు.వారి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. వంగర ఎంపిపి సురేష్ ముఖర్జీ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

28,29,30 తేదీల్లో భగత్‌సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్

ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 28,28,30 తేదీల్లో గురజాడ కళాక్షేత్రంలో జరగనున్న భగత్ సింగ్ స్టూడెంట్స్ ఫెస్ట్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా ఫెస్ట్ గోడ పత్రికను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేనంత యువత మన దేశంలో ఉన్నప్పటికీ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసై పెడతోవ పడుతున్నారని అన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం దీనికి మరికాస్త తోడవుతోందన్నారు. గొప్పగొప్ప ఉన్నత చదువులు చదువుకున్న వారు, మంచి తెలివైన విద్యార్థులు చదువు అనంతరం డబ్బుల కోసం మత్తు పదార్థాలు రవాణాకు పాల్పడుతున్నారన్నారు. తమ జీవితాలను, ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. వీటన్నింటికీ గల కారణం పిల్లలకు, తల్లిదండ్రులకు మధ్య సంబంధాలు అంతకంతకూ తగ్గుతుండడమేనని అన్నారు. ఒకప్పుడు విద్యార్థులకు విద్యతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేవని, అవి వారికి మానసిక ఉల్లాసాన్ని, నైతిక విలువలను అందించేవని తెలిపారు. ఇవి రానురానూ విద్యార్థులకు దూరమౌతున్నాయన్నారు. అందుకనే విజ్ఞానం-వినోదం లోనే డ్రగ్స్‌కు మించిన ఆనందం ఉందని అటు తల్లిదండ్రులను ఇటు విద్యార్థులను చైతన్యం చేసే కార్యక్రమానికి ఎస్ ఎఫ్ ఐ శ్రీకారం చుట్టిందన్నారు. డ్రగ్స్ బారిన పడితే జీవితాలు ఏ విధంగా నాశనం అవుతాయో తెలియజేస్తూ జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్లాస్మాబ్స్, వీధి నాటకాలు వేస్తున్నామన్నారు. ముగింపుగా మూడు రోజులు పాటు భగత్ సింగ్, గాంధీ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. పాటు కళాశాల స్థాయి విద్యార్థులు వారిలో ఉన్న టాలెంట్ ను పాటలు, డాన్స్, నాటికలు, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇనుస్ట్రుమెంట్స్ ప్లే చేయడం వంటి కాంపిటేషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకొని ఈ కార్యక్రమాల్లో పాల్గొన వచ్చన్నారు. మూఢ డనమ్మకాలకు వ్యతిరేకంగా సైంటిఫిక్ టెంపర్ను అందించడానికి 50 రకాల ప్రయోగాలతో విద్యార్థులందరినీ అబ్బురపరుస్తూ సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థులతోనే చేయిస్తామన్నారు. ఉత్తరాంధ్ర సాంప్రదాయ కళారూపాలైన పులివేశాలు, తప్పెటగుళ్ళు, థింసా వంటి కార్యక్రమాలను ప్రదర్శిస్తామన్నారు. .



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడుదాం : ఎస్‌పి

ప్రజాశక్తి, విజయనగరం కోట

మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలను ప్రజలకు, యువతకు వివరించి వారిలో చైతన్యం తీసుకొచ్చి విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలనే సంకల్పంతో వారికి అవగాహన కల్పించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ సూచించారు. విద్యార్థుల్లో మార్చాలనే భావనతో అన్ని స్కూళ్లలో , కళాశాలలో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు ఏర్పాటుచేసే ప్రతిపాదనతో వినూత్న కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. 'మాదక ద్రవ్యాలుకు వ్యతిరేకంగా పోరాడుదాం' అనే నినాదంతో మరికొద్ది రోజుల్లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతామని తెలిపారు.